క్లుప్తంగా

హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం చేయాలి



లచ్చయ్యపేటలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్‌సర్వే పనులు ఎన్యూమ(సచివాలయ ఉద్యోగులు)రేటర్లు వేగవంతం చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు కోరారు. ఈ మేరకు మండలంలోని లచ్చయ్యపేటలో సచివాలయం సిబ్బంది నిర్వహిస్తున్న హౌస్‌హోల్డ్‌సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదభోగిలి-1,2,అంటిపేట, లచ్చయ్యపేట,చినభోగిలి గ్రామాల్లో సచివాలయాల ఉద్యోగులు సర్వే చేస్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రజలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన కారణంగా సర్వే వేగవంతం చేయాలని సూచించినట్లు చెప్పారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు సచివాలయ ఉద్యోగులు నిర్దేశించిన ప్రాంతాల్లో సర్వేను పూర్తి చేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు సంతోష్‌కుమార్, తిరుపతిరావు, ఈదుబిల్లి రమేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెదపెంకిలో ఏఎల్‌ఓ స్ప్రే



మందు స్ప్రే చేయిస్తున్న అధికారులు, సిబ్బంది

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో లార్వా విజృంభించకుండా ఉండేందుకు ఏఎల్‌ఓ మందును వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్ప్రే చేయించారు. వీధికాలువలు, నూతుల వద్ద పేరుకుపోయిన మురికినీటిపైన, గుమ్మిలలో నిల్వ ఉండే నీటిపైనా, మురికి, చెత్తాచెదారాలు పేరుకుపోయిన ప్రదేశాలలో మందును స్ప్రే చేయడం వల్ల దోమల బెడదను నివారించవచ్చని వైద్యశాఖ సిబ్బంది ఈ సందర్భంగా తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతిరావు, హెల్త్‌అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చంటి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యం



సేంద్రియ పంటల ప్రదర్శనలో ఏఓ సింహాచలం, ఏపీఓ తులసీదాస్

భామిని: ఎటువంటి క్రిమిసంహారకాలు, ఎరువులు ఉపయోగించకుండా ప్రకృతి సాగు పద్ధతిలో పండించిన సేంద్రియ పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం, ఉపాధి ఏపీఓ ఇ.తులసీదాస్ అన్నారు. మండల కేంద్రంలో ఏపీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేంద్రియ పంటల ప్రదర్శనను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతి తక్కువ వ్యయంతో గోమూత్రం, ఆకులు, అలమల కషాయంతో పండించిన పంటల్లో విటమిన్లు, పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. వెలుగు ఏపీఎం ఎం.చక్రపాణి, ఇతర ఉద్యోగులు సేంద్రియ పంటలు, కూరగాయలు, ఆహార ధాన్యాలను కొనుగోలు చేశారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

వీరఘట్టం: ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని హుస్సేనుపురంలో సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. రైతులకు గరిష్ఠ గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే రైతులకు వేరేచోట ఎక్కువ ధర వస్తే వారు అక్కడ ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. హుస్సేనుపురంలో చాలా మంది భూములు ఈ-క్రాప్‌లో నమోదు కాలేదని, దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. అలాగే మిల్లర్లు ప్రతీ బస్తాకు 5 కిలోల ధాన్యం అదనంగా తూకం వేస్తున్నారని, రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని వాపోయారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి సమస్య రాకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ రత్నకుమారి, ఏఓ జె.సౌజన్య, కూటమి నాయకులు గర్భాన సత్తిబాబు, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

అపార్ కష్టాలు అనంతం


- సతమతమవుతున్న తల్లిదండ్రులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ



వంతరాం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రం

బలిజిపేట: విద్యార్థుల వివరాలను పూర్తిస్థాయిలో నమోదుచేసే ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రులకు శిరోభారంగా మారింది. వ్యవసాయ పనులతో బిజీ, బిజీగా ఉండే విద్యార్థుల తల్లితండ్రులు పనులు మానుకుని మీ సేవా కేంద్రాలు, కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. గడిచిన 5సంవత్సరాలలో అన్ని సేవలకు సంబంధించిన పనులు నదుటన చెమట పట్టకుండా, శరీర కష్టం ఏమీ కలగకుండా ఎవరిచుట్టూ ప్రదక్షిణలు లేకుండా జరిగేవి. ఇప్పుడు పని జరగాలంటే పలు పర్యాయాలు కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో రికార్డుల ప్రకారం ఆధార్ ఉంటే అపార్ కార్డు పొందడం చాలా సులభతరం. పాఠశాల ప్రధానోపాధ్యాయులే అప్‌లోడ్ చేసేస్తారు. తేడాలుంటేనే శిరోభారం తప్పదు.

ఆధార్ పోయి అపార్..



ఇంతవరకు ఆధార్ కార్డు లేకపోతే ఎటువంటి పనికి ఆటంకం కలిగేది. ఇప్పుడు కొత్తగా అపార్ కార్డు అంటున్నారు. ప్రభుత్వాలు కొత్తకొత్తవి పెట్టి ప్రజల ప్రాణాలు తీస్తున్నాయనే విమర్శలువినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పూర్తి వివరాల నమోదు కోసం అపార్ కార్యక్రమాన్ని చేపట్టింది. అపార్ నమోదులో ప్రతి విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పొందాలి. జనన ధ్రువీకరణ పత్రం ఆధారంగానే ఆధార్‌లోతప్పులు ఏమైనా ఉంటే వాటిని సవరించి అపార్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంది. ఇందుకోసం ముందుగా తమ పిల్లలు చదువుతున్న పాఠశాలలకు వెళ్లి అక్కడ విద్యార్థి పుట్టిన తేదీ వివరాలతో కూడిన స్టడీ సర్టిఫికెట్ తీసుకోవాలి. స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌లో పుట్టిన తేదీలు సరిగా ఉంటే అటువంటి వారికి ఇబ్బంది లేదు. ఆరెండింటిలో తేడాలు ఉంటే ఆతరువాత నోటరీ చేయించాలి. గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్‌ను తీసుకోవాలి. వాటన్నిటినీ కలిపి జనన ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దీనికి సంబంధించి ఆర్డీఓ ప్రాసీడింగ్ వచ్చిన తరువాత పంచాయతీ కార్యదర్శి జనన ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వగలరు. ఆ తరువాతే పుట్టిన తేదీలు, పేర్ల మార్పు జరిగి అపార్ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఈ విషయాలు తెలియని తల్లిదండ్రులు అక్కడ ఇక్కడ తిరగాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఆధార్‌లో పుట్టిన తేదీలు, పేర్లలో తప్పులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వీటిని అధికార యంత్రాంగం గుర్తించి మండలస్థాయిలో ఒక చోట వాటన్నింటిని పరిష్కరించే విదంగా ప్రత్యేక క్యాంపు ఏర్పాటుచేయాల్సి ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



పుట్టిన తేదీలో తప్పును ఏవిధంగా మార్పు చేసుకోవాలో కార్యదర్శిని అడుగుతున్న తల్లి

మండలస్థాయిలో ఇప్పటివరకు జరిగిన ప్రక్రియ:

బలిజిపేట మండలంలో పాఠశాలలు, కళాశాలలు: 65

మొత్తం విద్యార్థులు: 4,771మంది

ఇంతవరకు జనరేట్ అయినవి: 3,906

సమస్య పరిష్కరించేందుకు తగు ఏర్పాట్లు



ఆధార్, స్కూల్ రికార్డులకు తేడాలు ఉన్నందున విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇబ్బందులు పడకుండా ఉన్నతాధికారుల దృష్టిలో సమస్యలను పెట్టాం. వాటికి సంబంధించి అన్ని ఒకేచోట అయ్యేవిధంగా చర్యలు చేపడతామన్నారు.

సామల సింహాచలం, ఎంఈఓ-1, బలిజిపేట

జనన ధ్రువీకరణ పత్రానికి అవస్థలు:

ఆధార్‌లో పుట్టిన తేదీలో తప్పులు సవరించాలంటే గగనమవుతోందంటూ తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. జనన ధ్రువీకరణ పత్రాన్ని పొందాలంటే నోటరీ చేయించి, కార్యదర్శి నుంచి నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్ తీసుకుని దానిని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా అది ఆర్డీఓ కార్యాలయం వరకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి సంబంధించిన పని జరగాలంటే విద్యార్థి తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొంతమందికి చేతులు తడిపితే కాని పనులు జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆయుష్ మందులపై అవగాహన కల్పించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ హేమాక్షి

సీతానగరం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆయుష్ మందులు దివ్య ఔషధమని, బూర్జ ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ తెర్లి హేమాక్షి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బూర్జలో 'దేశ్‌కా ప్రకృతి పరీక్షన్ అభియాన్' పథకంలో భాగంగా గ్రామస్తులతో ఆయుష్ మందుల వినియోగం, వ్యాధుల నివారణ తదితర అంశాలపై సర్పంచ్ జి.దాసు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు, ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ ఆయుష్ వైద్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నెల రోజులు గ్రామ, పట్టణప్రాంతాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఉచిత మెడికల్ క్యాంప్‌లు, వైద్యసిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయుష్ మందుల వినియోగంపై అవగాహన సదస్సులను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల మానవహారం

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ రూపకర్త డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకట రావు మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా రూపొందారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు నిలిపివేయండి



మంత్రి సంధ్యారాణితో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు

సాలూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, పట్టణంలోని రాజేశ్వరరావు పార్కు నుంచి మెయిన్ రోడ్డు గుండా మంత్రి సంధ్యారాణి ఇంటి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను అదుపుచేయాలని కోరారు. పట్టణంలో మున్సిపల్ కార్మికులందరికీ బకాయి వేతనాలు అందేలా పాలకవర్గంతో చర్చించాలని, రానున్న శ్యామలాంబ పండగను దృష్టిలో పెట్టుకుని కార్మికుల సంఖ్య పెంచాలని కోరుతూ మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉమ, సంతోష్, శంకరరావు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌సీ కృష్ణమూర్తి

పార్వతీపురంటౌన్: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి దివ్యాంగులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. పార్వతీపురం మండలంలోని చందలంగి గిరిజన గ్రామంలోని 40 మంది వృద్ధులు, దివ్యాంగులు, మహిళలుకు రగ్గులు, స్టీల్ గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో పెద్దలు త్రినాథ, వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పాలకొండ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారకులు కావద్దని ఎంవీఐ తంగి వేణుగోపాలరావు సూచించారు. పాలకొండ-వీరఘట్టం ప్రధాన రహదారిలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా అధిక లోడుతో వచ్చే ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాలను నిలుపుదల చేసి డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వ్యవసాయ సీజన్ కావటంతో చెరకు, ధాన్యం, గడ్డి, ఊక, తాడు తదితర వాటిని నిబంధనలకు విరుద్ధంగా అధికంగా లోడు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ క్రమంలో నిబంధనలు అతిక్రమించిన రెండు ట్రాక్టర్లపై అపరాధ రుసుం విధించారు. ఆయన వెంట సహాయ మోటారు వెహికల్ అధికారి నవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

జీరోటిల్లేజ్‌లో జొన్న విత్తడంతో ఆదా



మాగాణీ భూమిలో జీరోటిల్లేజ్ విధానంతో జొన్న విత్తనం నాటుతున్న ఏఓ అవినాష్

సీతానగరం: వరికోత పూర్తిచేసిన అనంతరం మాగాణీ భూమిలో జీరోటిల్లేజ్ విధానం ద్వారా మొక్క జొన్నవిత్తనాలు నాటడం వల్ల రైతుకు పనిభారం తగ్గుతుందని, కూలీల బెడద, దుక్కి ఖర్చు తగ్గుతుందని ఏఓ ఎస్ అవినాష్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని లక్ష్మీపురంలో గల వరి మాగాణీ భూముల్లో జీరోటిల్లేజ్ విధానం ద్వారా తీసిన తీసిన గోతుల్లో కత్తవతో లేదా యంత్రపరికరంతో తీసిన జొన్నవిత్తనాలు వేసే పనిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పద్ధతిలో వరిచేనుకోసిన తరువాత దుక్కి దున్నకుండా విత్తడం వేయడం వల్ల దుక్కి ఖర్చు, సాగు ఖర్చు, దుక్కి ఖర్చు,సాగు సమయం, తేమశాతం తగ్గడంతో పాటు సమయం ఆదాఅవుందన్నారు. ఎకరా విస్తీర్ణానికి 8 కేజీలు, 50 కిలోల డీఏపీ,150 నుంచి 175 కిలోలు యూరికా 50 కిలోల పొటాషియం వంతునమూడు విడతలు వేసుకోవాలని సూచించారు. అలాగే ఎరువులు వేయడం వల్ల చేను ఏపుగా పెరిగి, దుక్కగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతుల్లో అపరాల సాగు మేలు



రైతు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ భారతి

బలిజిపేట: అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్లనే మంచి దిగుమతులు వచ్చి రైతుకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సహాయకురాలు డి.భారతి తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అంపావల్లి, పెదపెంకి గ్రామాల్లో అపరాల సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరాలలో చిత్త పురుగుల ఉధృతి ఉన్నందున నివారణకు 2.5ఎంఎల్ క్లోరోఫైరిపాస్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. కలుపు సమస్య ఉంటే 15నుంచి 20రోజుల్లో నివారణకు ఇమజిత్‌సెర్ అనే కలుపు మందు 400ఎంఎల్ ఎకరాకి పిచికారి చేయాలని చెప్పారు. పంటదశ 20నుంచి 25రోజులు ఉన్నప్పుడు 19-19-19ఎకరాకు ఒక కిలో 200లీటర్ల నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. ఇవికాక వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిని సలహాలు అడిగి తెలుసుకుని యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచిదని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గోశాల నిర్మాణాల పరిశీలన



మాట్లాడుతున్న పశుసంవర్థక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: మండలంలో పాడి పశువులున్న రైతులకు ఉపాధిహామీ పథకం నిధులతో మంజూరు చేసిన గోశాలల పనులు వేగవంతం చేయాలని సీతానగరం పశుసంవర్థక శాఖ సబ్ డివిజన్ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు బుడ్డిపేటగ్రామం వద్ద నిర్మాణం లో ఉన్న గోశాలలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం నుంచి గోశాలల కోసం 24 దరఖాస్తులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించగా 23 మంజూరుచేస్తూ ఉత్తర్వులు వచ్చాయని తెలియజేశారు. దీంతో నిర్వాహకులు పనులు చేపట్టడంతో అవి వివిధ స్థాయిల్లో ఉన్నాయని సంబంధిత అధికారులు తెలియజేయడం వల్ల వాటిని పరిశీలించి తగుసూచనలు ఇచ్చినట్లు తెలిపారు.
నిర్దేశించిన గడువులోగా వాటిని పూర్తి చేయాలని సూచించారు.

పాఠశాల పనివేళల్లో మార్పు సరికాదు

వీరఘట్టం: పైలట్ ప్రాజెక్టు క్రింద ఉన్నత పాఠశాలల్లో పనివేళల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదికాదని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ మీడియా సెల్ కన్వీనర్ అన్ను వెంకటరావు అన్నారు. మంగళవారం ఆయన వీరఘట్టంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయు విధానం అశాస్త్రీయమైందన్నారు. దీని వల్ల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా ఒత్తిడికి గురవుతారన్నారు.

ఇటువంటి నిర్ణయాలు విద్యా వ్యవస్థ పతనానికి దారితీస్తాయన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల్లో చదివే బాలికలు ఇంటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడతారని, ఈ నిర్ణయంపై ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.

గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు

- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

పార్వతీపురంటౌన్:

తమ సమస్యలు పరిష్కరించాలని గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు గిరిజన గురుకుల పాఠశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని, పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే తమతో చెప్పినట్లు అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

ఏడో రోజు దీక్షల్లో భాగంగా, రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పూలమాలలు వేసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, డీఎస్సీ నుంచి తమ పోస్టులు మినహాయించాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు దివాకర్, రమేష్, రాజేష్, వెంకట్, జగదీష్, జ్యోతి, లక్ష్మి, కవిత, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధంగా పాలన

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజ్యాంగ స్ఫూర్తితో పాలన సాగిందని..నేడు కూటమి ప్రభుత్వంలో రాజ్యాంగ విరుద్ధంగా పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 75వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ శ్రేణులు అందరితో కలిసి మేదర వీధి వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి రాజ్యాంగ నిర్మాతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన రాజ్యాంగ స్ఫూర్తితో గత ఐదేళ్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలనా కాలంలో వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన కొనసాగిస్తే, 6నెలల క్రితం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రెడ్‌బుక్ పాలను చేపట్టిందన్నారు. రాష్ట్రంలో హింస, కక్షపూరిత పాలన చేపట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను అయోమయానికి గురిచేసిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీలు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జీ, బలగ రేవతమ్మ, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథం, బి.రవికుమార్, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.